క్లుప్తంగా

మండలంలో ప్రశాంతంగా పది పరీక్షలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో బుధవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. వెల్లటూరు, పెదపులివర్రు, పల్లెకోన, ఐలవరం, జెడ్పీ హైస్కూళ్లు, టీఎంరావు హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎస్‌ఎస్‌సీ హిందీ పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 742 మంది విద్యార్థులకు గాను 9 మంది గైర్హాజరయినట్లు ఎంఈవో పులి లాజర్, నీలం దేవరాజ్‌లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలోని పెదపులివర్రు, ఓలేరు గ్రామ పంచాయతీలలో బుధవారం రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో గ్రామం నుంచి ఎంపీటీసీ సభ్యుల అభ్యర్థన మేరకు రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రహదారులు, తాగునీటి సరఫరా, సీసీ డ్రైన్‌ల నిర్మాణం నిమిత్తం మండల పరిషత్ నిధుల నుంచి మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యురాలు నీలా సాంబమ్మ, పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



కొల్లూరు : గర్భిణులు అనారోగ్యానికి గురవ్వకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని బొద్దులూరుపాడులో సామాజిక వేడుకలలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ముఖ్యమని లేని పక్షంలో రక్తహీనతకు గురయ్యే ముప్పు ఉందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహార పదార్థాలతో పాటు, తక్కువ ఖర్చుతో బలవర్ధక ఆహార పదార్థాలను తయారు చేసుకొని తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి.నగరాజ కుమారి పాల్గొన్నారు.

సముద్రపు ఒడ్డున వ్యక్తి మృతదేహం లభ్యం



నిజాంపట్నం: సముద్రపు ఒడ్డున వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన దిండి పంచాయతీ పరిశావారిపాలెం సముద్రపు ఒడ్డున చోటు చేసుకుంది. ఎస్‌ఐ తిరుపతిరావు తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో పరిశావారిపాలెం సముద్రపు ఒడ్డున ఉన్న మృతదేహాన్ని పరిశీలించామన్నారు. మృతదేహం నిజాంపట్నం కలిమి సెంటరుకు చెందిన ఒడుగు నాగవర్మ(ది) (24)గా గుర్తించటం జరిగిందన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుని తండ్రి నాగబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి



జీఎస్‌పాలెం(కర్లపాలెం): విద్యుదాఘాతంతో బాలిక మృతి చెందిన ఘటన పిట్టలవాని పాలెం మండలం గోకరాజు నల్లిబోయిన వారిపాలెంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కాసుల సుధాకర్ నాగలక్ష్మిల కుమార్తె బేబీశ్రీ(6) ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ టేబుల్ ఫ్యాన్‌ను అంటుకోవటంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. సుధాకర్ నాగలక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె బేబీశ్రీ ఉన్నారు. బేబీశ్రీ మృతి చెందటంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

అధ్వానంగా పార్కులు.. నిరాశలో చిన్నారులు

- శిథిలమైన ఆట వస్తువులు
- గాయాల పాలవుతున్న పిల్లలు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన జారుడు బల్లపై ఆడుకుంటున్న బుడతడు



చంద్రమౌళి పార్కులో పూర్తిగా మాయమైన ఉయ్యాలలు

రేపల్లె రూరల్: చిన్నారులకు ఆటవిడుపును అందించే పార్కులు నిరాదరణకు గురవుతున్నాయి. ఆట వస్తువులు శిథిలావస్థకు చేరి సంవత్సరాలు గడుస్తున్నా నూతన ఆట వస్తువులు ఏర్పాటు చేయటంలో మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపకపోవటంతో చిన్నారులు నిరాశకు గురవుతున్నారు. పట్టణంలోని చంద్రమౌళి పార్కులో సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు పూర్తిగా శిథిలమై పాడైపోయి అధ్వానంగా తయారయ్యాయి. సెలవు దినాలు, సాయంత్రం వేళల్లో ఆటవిడుపు కోసం ఆ పార్కుకు వచ్చే చిన్నారులు పాడైపోయిన ఆట వస్తువులతోనే ఆటలు ఆడుతూ ఇబ్బందులు పడుతున్నారు.

గాయాలపాలవుతున్న చిన్నారులు

పార్కులకు వచ్చిన చిన్నారులు ఈ శిథిలావస్థకు చేరిన ఆట వస్తువులలోనే ఆడుకుంటున్నారు. వాటితో ఆటలు చిన్నారులకు పరీక్షగానే మిగులుతున్నాయి. ఈ ఆట వస్తువులతో ఆడుకునే సమయంలో చిన్నారులు గాయాలపాలైన ఘటనలు కో కొల్లలు ఉన్నాయి. పట్టణాలలో ఇరుకు గృహాల మధ్య ఆటవిడుపు స్థలాలు లేకపోవడంతో చిన్నారులు సెలవు దినాలలో ఆటవిడుపు కోసం పార్కులకు అధిక సంఖ్యలో వస్తుంటారు. సరదాగా ఊగే ఉయ్యాల, జారుడ బల్లలు, రంగుల రాట్నాలు పాడైపోవడంతో పార్కులకు వచ్చే చిన్నారులకు నిరాశ ఎదురవుతుంది. ఉప్పూడి రోడ్డులోని పార్కులో, హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్కులోనూ శిథిలమైన ఆట వస్తువులు దర్శనమివ్వటం, ఆట వస్తువులు లేకపోవటం వంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి.



చంద్రమౌళి పార్కులో జారుడు బల్లల పైభాగంలో తప్పపట్టిన మెస్

రూ.10 లక్షలతో అభివృద్ధి

గత సంవత్సరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కును రూ.10 లక్షలతో అభివృద్ధి చేసి అన్ని రకాల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. చంద్రమౌళి పార్కులోని ఆట వస్తువులు శిథిలమై ఉండడంతో పట్టణంలోని చిన్నారులు అధిక సంఖ్యలో అంబేడ్కర్ పార్కును ఆశ్రయిస్తూ ఉండడం వల్ల పార్కులో రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చంద్రమౌళి పార్కులో ఆట వస్తువులను పునరుద్ధరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ఏర్పాటు చేస్తాం



చంద్రమౌళి పార్కులోని ఆట వస్తువులు శిథిలావస్థకు చేరుకున్న అంశం ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. పార్కును అభివృద్ధి చేసి నూతన ఆట వస్తువులు ఏర్పాటు చేసేందుకు రూ.10 లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి కేటాయించటం జరిగింది. ప్రస్తుతం పార్కు గోడలకు రంగులు వేస్తున్నాం. శిథిలమైన ఆట వస్తువులను తొలగించి నూతన ఆట వస్తువులను త్వరలో ఏర్పాటు చేస్తాం.

– కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

వైద్యశాల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి



వైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ, ఎంపీడీవో

భట్టిప్రోలు: గత ప్రభుత్వం వైద్యశాలల అభివృద్ధికి నాడు–నేడు విధానంలో నిధులు ఇవ్వడం జరిగిందని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి తెలిపారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీని మండల పరిషత్ అధ్యక్షురాలు, ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ చైర్మన్ లలితకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వైద్యశాల రికార్డులు, గతంలో పని చేసిన పనుల వివరాలకు సంబంధించిన బిల్లులను పరిశీలించారు. రికార్డులు, బిల్లుల వివరాలను సక్రమంగా నిర్వహించాలని వైద్యశాల సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం కూడా వైద్యశాలల అభివృద్ధికి తగిన నిధులు ఇవ్వాలని ఆకాంక్షించారు. ఆ నిధులతో వైద్యశాల వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో నూతన నిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదన సిద్ధం చేస్తామని అన్నారు. సిబ్బంది హాజరు, రాత్రి వేళల్లో అందుబాటు విషయంపై ఆరా తీశారు. ఆమె వెంట ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, వైద్యాధికారి ఎ.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ టి.ఉదయభాస్కరి, స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.

పార్టీ బలోపేతానికి పని చేయండి

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చిస్తున్న రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గ పరిస్థితిపై జగన్‌మోహన్‌రెడ్డితో బుధవారం చర్చించిన అనంతరం డాక్టర్ గణేష్ మాట్లాడారు. పార్టీ బలోపేతానికి క్షేత్ర స్థాయిలో కార్యకర్త నుంచి నాయకుడి వరకు సమన్వయంతో కలసికట్టుగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. అధికార పార్టీ చేస్తున్న తప్పిదాలను ఎండగట్టడంతో పాటు, వారు చేస్తున్న దురాగతాలను ప్రజలకు తెలిపి చైతన్య పరచాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

సారా విక్రయించడం చట్టరీత్యా నేరం

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్



మార్కెట్ సెంటరులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సిబ్బంది

రేపల్లె రూరల్: సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ దివాకర్ కోరారు. నాటుసారా, ఇతర మాదక ద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలపై నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గుడ్డికాయలంక గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నాటుసారా తాగటంతో అనారోగ్యం పాలవ్వటం తప్పదన్నారు. నాటుసారాతో గ్రామీణ ప్రాంతాలలో అనేక మంది రోడ్డుపాలైన ఘటనలను గుర్తు చేశారు. నాటుసారా తయారు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. గతంలో నాటుసారా తయారు చేసిన వారు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. వీరిపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. నాటుసారా, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను తెలియజేస్తూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉయ్యూరు శ్రీనివాసరావు, ఎస్‌ఐ రాజశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

మోపిదేవికి ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు

రేపల్లె రూరల్: కృష్ణా జిల్లా మోపిదేవి గ్రామంలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తుంటారని, ఆ క్షేత్రానికి రేపల్లె నుంచి బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు అన్నారు. రేపల్లె ఆర్టీసీ డిపో కార్యాలయంలో బుధవారం ఆర్టీసీ డీఎం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు రేపల్లె మీదుగానే మోపిదేవి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. రేపల్లె ఆర్టీసీ డిపో నుంచి చల్లపల్లికి మోపిదేవి ఆలయం మీదుగా నడిపితే భక్తులకు సౌకర్యం కలగటంతో పాటు ఆర్టీసీకి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు నల్లూరు కృష్ణమాచార్యులు, వెంకట మోహనరావు, గుంటి సాంబశివరావు, కె.వెంకటేశ్వర్లు, కొడాలి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రవీంద్ర

కర్లపాలెం: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన మండల కేంద్రం కర్లపాలెంలో చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం సెంటర్‌లోని మన గ్రోమోర్ షాపు పక్క సందు నుంచి అగ్రహారం వెళ్లే రహదారిలో పంట కాలువ అంచున సుమారు 25 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని యువకుని మృతదేహం పడి ఉంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు కర్లపాలెం ఎస్‌ఐ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతుని వివరాలు తెలిసిన వారు కర్లపాలెం పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్



టిడ్కో గృహాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

రేపల్లె రూరల్: పట్టణంలో నిర్మాణం మధ్యలో ఆగిపోయిన టిడ్కో గృహాలను పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. అరవపల్లి సమీపంలో టిడ్కో గృహాల సముదాయాన్ని బుధవారం సీపీఎం బృందం పరిశీలించి నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ 7 సంవత్సరాల క్రితం 12.78 ఎకరాలలో 1,344 మంది లబ్ధిదారులకు గృహాలు అందించేలా అప్పటి టీడీపీ ప్రభుత్వం గృహ నిర్మాణాలు ప్రారంభించిందన్నారు. ఏడాదిలోపే గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని చెప్పి ఒక్కో లబ్ధిదారు నుంచి రూ.12,500 నుంచి రూ.1లక్ష వరకు డిపాజిట్ల రూపంలో సేకరించిందన్నారు. టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి లబ్ధిదారులకు గృహాలు అందించకుండా మోసం చేసిందన్నారు. గృహాలు వస్తాయి అద్దె భారం తగ్గుతుందన్న ఆశతో ఎంతో మంది పేదలు అప్పులు చేసి అప్పటి టీడీపీ ప్రభుత్వానికి నగదు చెల్లించారన్నారు. నిరుపేదల బాధలను దృష్టిలో ఉంచుకుని మధ్యలో ఆగిపోయిన టిడ్కో గృహాలను పూర్తి చేసి అందించాలన్నారు. లేని పక్షంలో లబ్ధిదారులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కేవీ లక్ష్మణరావు, ఆశీర్వాదం, అగస్టీన్, రమేష్, గోపీ, కె.నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

తెనాలిరూరల్: రూరల్ పరిధిలోని జగ్గడిగుంటపాలెంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితురాలికి బుధవారం నిత్యావసరాలను అందించారు. దాత మొవ్వ సత్యనారాయణ అందించిన రూ. ఐదు వేల నగదును, రెడ్ క్రాస్ తెనాలి శాఖ అందించిన వంట పాత్రలను, రెవెన్యూ శాఖ నుంచి బియ్యం నిత్యావసరాలను బాధితురాలు గండికోట ఆదిలక్ష్మికి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను ఆదుకునేందుకు దాతలు, రెడ్ క్రాస్ సంస్థ స్పందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. మొవ్వ సత్యనారాయణ, రెడ్ క్రాస్ బృందం పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ జయనాగలక్ష్మి

తెనాలి టౌన్: డ్వాక్రా మహిళలు వృత్తి నైపుణ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సంగం జాగర్లమూడి గ్రామ సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని సంగం జాగర్లమూడి గ్రామం ఎలిమెంటరీ పాఠశాలలో జెఎంజె మహిళా కళాశాల గృహ విజ్ఞానశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణా తరగతులు నిర్వహించారు.ముఖ్యఅతిథిగా సర్పంచ్ జయనాగలక్ష్మి పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దుస్తులపై పెయింటింగ్,రంగుల వినియోగం, తయారీ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ జయనాగలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు తెనాలి జెఎంజె మహిళా కళాశాల గృహ విజ్ఞానశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో టై అండ్ డై కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు ఎంతో ఓర్పుతో మహిళలకు శిక్షణ ఇస్తున్నారని అభినందించారు.కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

పొగతో విద్యార్థుల వెతలు



డంపింగ్ యార్డు నుంచి వస్తున్న దట్టమైన పొగలో రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు, ప్రజలు

రేపల్లె రూరల్: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణ వాసులకు తిప్పలు తప్పటం లేదు. పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ స్కూలు రోడ్డు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులోని చెత్తకు ఇటీవల మున్సిపల్ కార్మికులు నిప్పు అంటించారు. చెత్త రగులుకొని గత 15 రోజులుగా ఆ ప్రాంతంలో దట్టమైన పొగ రావటంతో పాటు వెదజల్లుతున్న దుర్గంధంతో స్థానికులు, ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నాలుగు రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు అధికమవడంతో పాటు చెత్త నుంచి వస్తున్న పొగతో ఆ రహదారిపై వెళ్లే వారు ఊపిరి బిగపెట్టుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం మోంట్‌ఫోర్ట్ స్కూలులో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతుండటంతో రేపల్లె పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల నుంచి పరీక్షలు రాసేందుకు వస్తున్న విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పొగ కేవలం రోడ్డుపైనే కాకుండా పరీక్ష కేంద్రంలో సైతం కమ్మేస్తుండటంతో పరీక్షలు రాసే విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నట్లు ఇన్విజిలేటర్‌లు చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తకు పెట్టిన మంటను అదుపు చేసి పొగరాకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మొక్కజొన్న పైరుకు చివరి నీటి తడులు పెట్టుకోవాలి

తెనాలి టౌన్: మొక్కజొన్న పైరుకు చివరి నీటి తడులు పెట్టుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని అంగలకుదురు,చావావారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ పాల్గొని రైతులకు వ్యవసాయ సంబంధమైన పలు విషయాలు సూచించారు.మొక్కజొన్న పైరు కండె దశలో ఉన్నందున ఈ నెలాఖరు లేదా ఏప్రిల్ మొదటి వారంలోకండె విరిచేందుకు పంట సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రైతులు మొక్కజొన్న పైరుకు చివరి తడిగా నీటిని పెట్టుకోవాలని స్పష్టం చేశారు. మొక్కజొన్న అనంతరం పచ్చిరొట్ట పైరు వేయడంవల్ల భూసారం వృద్ధి చెందుతుందని తెలిపారు.కాంప్లెక్స్ ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతుందని అన్నారు. రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలని సూచించారు. అపరాల సాగుగా మినుము,పెసర పైరు వేసిన రైతులు పంటను ప్రభుత్వానికి అమ్మదలచినచో గ్రామంలోని రైతుసేవా కేంద్రాల్లో పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.వేసవిలో అపరాల సాగు చేసినచో భూసారం వృద్ధిచెందుతుందని వివరించారు.కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు సాయి దీపిక,పలువురు రైతులు పాల్గొన్నారు.

23న ఉచిత కంటి వైద్య శిబిరం

భట్టిప్రోలు: భట్టిప్రోలు డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినాల మనుమడు హ్యాండీ జోయల్ మొదటి పుట్టిన రోజు సందర్భంగా (కేఎస్‌కే) విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో శంకర్ కంటి ఆసుపత్రి (పెదకాకాని) వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయబడునని తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, రేషన్, ఓటరు, ఆరోగ్యశ్రీ కార్డుల జిరాక్స్ కాపీలు, ఫోన్ నెంబర్ తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 950239 6090 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్లపాలెం: బీసీ ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే రాయితీ రుణాలకు ఈ నెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయితీ రుణాలకు 21 నుంచి 60 ఏళ్ల లోపు పేదలు అర్హులని అన్నారు. దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డుల జిరాక్స్‌లు జత పరచాలని చెప్పారు. చిన్న, మధ్య తరహా యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

వెల్లటూరులో ఉచిత ధ్యాన యోగా కార్యక్రమం

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం సహజ యోగా ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. మాతాజీ నిర్మలాదేవి మాట్లాడుతూ ఆత్మసాక్షాత్కారం పొందడం అనేది చాలా సరళమైన సాధారణమైన ప్రక్రియ అని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సహజ యోగా ధ్యాన సాధన ద్వారా ఆనందం పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ధ్యానం ఉచితంగా నేర్పబడనున్నట్లు చెప్పారు.

విద్యార్థి అదృశ్యం

బాపట్లటౌన్: విద్యార్థి అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ 2వ సంవత్సరం చదువుతున్న షేక్ సమీర్ ఈ నెల 11న రాత్రి 10.30 గంటల సమయంలో పట్టణంలోని అఖిల బాయ్స్ హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పేటలో ప్రేమ అంశంపై విద్యార్థులకు అవగాహన

భట్టిప్రోలు: భట్టిప్రోలు రైలుపేటలో బుధవారం శాశ్వతమైన ప్రేమ అంశంపై విద్యార్థులకు రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తపస్సు కాల సిలువ యాత్ర 15వ రోజున పునీత జోజప్ప మహోత్సవం నిర్వహించారు. రక్షణ ప్రణాళికలు దేవమాతకు భర్తగా, దివ్య బాల ఏసుకు సాకుడు తండ్రిగా, తిరు కుటుంబ పోషకుడిగా తన జీవిత పాత్రలో నీతి మంతునిగా, కష్టజీవిగా, విశ్వసనీయుడిగా వినుతికెక్కిన సుగుణ శీలుడు పునీత జోజప్ప అని తెలిపారు. జోజప్ప విశ్వాస జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ క్రీస్తు బాటలో అడుగులు వేయాలని ఆదేశిస్తున్నదని అన్నారు.

బాపట్ల వాసి 'బొడ్డుపల్లి'కి డాక్టరేట్



బాపట్ల : దేశంలోనే అత్యుత్తమ ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాల్లో ఒకటైన బిట్స్ పిలాని విశ్వవిద్యాలయం హైదరాబాద్ కేంద్రం నుంచి బాపట్లకు చెందిన బొడ్డుపల్లి వెంకట శివకుమార్ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టాను అందుకున్నారు. బాపట్ల పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డులోని బొడ్డుపల్లి వారి వీధికి చెందిన రిటైర్డ్ పంచాయతీరాజ్ శాఖ అధికారి బొడ్డుపల్లి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, సత్యవతిల పెద్ద కుమారుడు బొడ్డుపల్లి వెంకట శివకుమార్ ఆచార్యులు డాక్టర్ కె.వి.జి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో 'డిజైన్ సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవల్యూయేషన్ ఆఫ్ నైట్రోజన్ బేస్డ్ హెటిరో సైకిల్స్ యాజ్ యాంటీ ట్యుబర్కులర్ ఏజెంట్స్' అనే అంశంపై పరిశోధన విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మేరకు పలువురు వెంకట శివకుమార్‌ను అభినందించారు.

చెత్త సేకరణ నూరు శాతం చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: తెనాలిలో చెత్త సేకరణ నూరు శాతం జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బీసీ కాలనీలో బుధవారం ఆయన పర్యటించారు. ఆప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్లు, మురుగు కాల్వలపై చెత్త ఉండకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.